

కథ 2011

2

# ఖేయోస్

బి. అజయ్‌ప్రసాద్

"ఇదిగో జీవానంద్," అన్న పిలుపుని జీవా వినిపించుకోలేదు. అతడు పరధ్యానం మనిషి.

అంతేకాక ఆ ఊళ్లో అతడికి తెలిసినవాళ్లెవరూలేరు. అదొక చిన్న పల్లెటూరు. దూరపు బంధువుల ఇంట్లో పెళ్లికని అతడా ఊరు వచ్చాడు. చాలా సంవత్సరాల తరవాత ఆ ఊళ్లో అడుగుపెట్టాడు.

చాలా చిన్నగా ఉన్నపుడు తల్లితో కలసి ఆ ఊరికి వచ్చాడు. మళ్లీ ఆ ఊరి మొహం చూడలేదు. అది అతడి తల్లి తరపున పూర్వీకుల గ్రామం.

అసలా ఊరు మళ్లీ రావలసి వస్తుందని కూడా అతనెప్పుడూ అనుకోలేదు. పెళ్లిలో అతడిని గుర్తుపట్టి పలకరించేవాళ్లెవరూ లేకపోవడంతో ఒకసారి అలా ఊరు చూసివద్దామని పెళ్లిలోంచి బయటపడి రోడ్డు మీదకు వచ్చాడు.

అతడు ఒకటి రెండు వీథులు దాటాడో లేదో ఒక ఇంట్లోంచి మళ్లీ ఆ పిలుపు. తలతిప్పి చూశాడు. తన నెవరో గుర్తుపట్టి పిలిచినందుకు అతడికి ఆశ్చర్యం కలిగింది. కర్రలతో చేసిన తడికను తప్పుకుని లోపలికి వెళ్లాడు. ఆరుబయట నీరెండలో ఎవరో ఓణీ కట్టుకున్న అమ్మాయి మిరపకాయలు ఎండబెడుతూ ఉంది. కొత్త మనిషిని చూడగానే కోడి ఒకటి తుర్రుమని గడ్డివాము వైపు పారిపోయింది. కొబ్బరిచెట్టు నీడలో కూర్చున్న గేదె పచ్చిగడ్డి నెమరేస్తూ ఉంది. పెంకుటిల్లుకి ముందు వైపున ఆనుకుని ఉన్న రెల్లుగడ్డి కప్పిన వసారాలో పడకకుర్చీ మీద ఒక ముసలాయన కూర్చుని వున్నాడు. గుమ్మం దగ్గర ముగ్గురు నలుగురు ఆడవాళ్లు కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

లోపలికి పిలిచినావిడ వాకిట్లో నుంచుని అతడెవరో తెలిసినట్లే అప్యాయంగా నవ్వుతూ ఉంది. ఆమె వయసు యాభైయేళ్లు పైనే ఉండవచ్చు. జుట్టంతా తెల్లబడి చూడటానికి ముసలామెలా ఉన్నా ఉత్సాహంగా ఉంది.

"మన ఈశ్వరి కొడుకే. ఎప్పుడో చిన్నతనంలో చూడ్డం," అన్నారెవరో కూర్చున్న వాళ్లలోంచి.

"ఏ ఈశ్వరి?"

"మా పినతల్లి శేషారత్నంలేదూ... దాని కూతురు."

"శేషారత్నమా..?"

"మాధవరావు తెలియదా?"

వాళ్లు అతడిని పట్టించుకోకుండా వాళ్లలో వాళ్లు మాట్లాడుకుంటున్నారు. జీవానందానికేమీ పాలుపోలేదు, ఇక్కడ తనకు తెలిసిన వాళ్లెవరూలేరు కాని తనను గుర్తుపట్టేవాళ్లున్నారు. తనకు తెలియని పూర్వీకులు కూడా వాళ్లకు తెలుసని అనుకున్నాడతడు. జీవానందానికి వింతగా అనిపించింది.

"వాడా...! వాడంత భ్రష్టుడు ఇంకెక్కడా లేడు," అన్నాడు పడక్కుర్చీలో కూర్చున్న ముసలి వ్యక్తి ఉన్నట్లుండి కఠినంగా.

ముసలాయన మాటలు విని జీవానందం నిర్ఘాంతపోయాడు. బహుశా ఆ ముసలాయన జీవా

నందం అమ్మమ్మకు అన్నయ్య వరసో తమ్ముడి వరసో.

"నువ్వూరుకోవయ్యా... ఇప్పుడయన్నీ ఎందుకు," అన్నారెవరో కూర్చున్న వాళ్లలో.

ఆ మాటలకు జీవానందం కాస్త స్థిమితపడ్డాడు. అక్కడ కూర్చున్న వాళ్లంతా అప్పుడే పెళ్లి నుంచి వచ్చినట్లు కనపడుతూనే ఉంది. వాళ్లందరూ కొత్తబట్టలు వేసుకుని ఉన్నారు. అతడిని లోపలికి పిలిచినావిడ మాత్రం కలుపుగోలుగా మాట్లాడుతూనే ఉంది, బాగా తెలిసినట్లుగా చేతులు పట్టుకుని తడిమి, "ఎప్పుడనగా చూశాను. మీ అమ్మ చనిపోయినప్పుడు రావడానికి కుదరలేదు. మీ అమ్మకూ నాకూ మంచి స్నేహితం. నిన్ను పెంచింది నేనే అనుకో..."

"అవును మరి ఎవరిని సుఖపడనిచ్చాడు కనుక," లోపల ఇంకెవరో ముసలావిడ గొణుగుడు. మాట్లాడింది ఎవరిని ఉద్దేశించి...?

అతడితో ఎవరు మాట్లాడుతున్నారు...?

ఎవరు ఎవరి గురించి చెప్తున్నారు?

తన గురించా..?

కాదు. మాధవరావు గురించి.

మాధవరావు ఎవరు? అతడి తాత. అమ్మకు నాన్న. తను అచ్చం తాత పోలికేనని అమ్మ చెప్తుండేది జీవానందానికి.

"వాడొట్టి నిగమశర్మ," అన్నాడు మళ్లీ ముసలాయన పళ్లు బిగించి.

"ఎన్ని కష్టాలు పెట్టాడో? ఉన్నవన్నీ అమ్ముకు తిరిగాడు. గంగాళాలు, ఇత్తడి బిందెలు... చేతికి ఏది దొరికితే అది... ఎలా ఓర్చుకుందో ఆ మహాతల్లి. ఎలా నెట్టుకొచ్చిందో సంసారం ఆ దేవుడికే ఎరుక."

వాళ్లెవరికీ సమాధానం చెప్పకుండానే దబదబ బయటకు నడిచాడు జీవా. కాలిబాట పక్కన రెల్లుగడ్డి కప్పిన తాటాకుల ఇళ్లు. కంది కంపతో అల్లిన దడులు. కొన్నిచోట్ల పెంకుటిళ్లు. దారిలో ఒక ముసలి వ్యక్తి ఎదురుపడి అతడిని పరిచయం చేసుకోకుండానే, "గుంటూరు ఎప్పుడు వస్తున్నావ్," అన్నాడు.

జీవా వంచిన తల ఎత్తకుండానే గబగబ ముందుకు నడిచాడు. 'పెళ్లిలో తనను గుర్తుపట్టి పలకరించిన నాథుడేలేడు. బయటకు వస్తే అందరూ గుర్తుపట్టేవాళ్లే,' అనుకున్నాడు జీవా.

అతడికి తన తల్లి తరఫు చుట్టరికం తెలియదు. చిన్నతనం నుంచి మితభాషి, మొహమాటస్తుడు కావడంతో అందరికీ దూరంగా ఉండిపోయాడు. దగ్గరి బంధువులు కూడా అనేకమంది అతనికి పరిచయం లేదు. తల్లి మరణంతోనే సంబంధాలు తెగిపోయాయి. తన చిన్ననాటి జ్ఞాపకాలేవీ అతడికి పూర్తిగా గుర్తులేవు.

తన జీవితంలో ఇటువంటి పరిస్థితి ఎదురవుతుందని అతడు కలలో కూడా ఊహించలేదు.

*

పెళ్లికి వెళ్లొచ్చాడన్నమాటే కాని ఆ చిన్న పల్లెటూర్లో, ఆ పెంకుటిల్లు దూరపు బంధువుల మాటలను చాలారోజులపాటు మరిచిపోలేకపోయాడు జీవా. ఆ ఊళ్లో తను గుర్తుపట్టని బంధువులు తనని పలకరించడం, తనెప్పుడూ చూడని తన పూర్వీకుడి గురించి ప్రస్తావించడం అతడికి ఆశ్చర్యంగా అనిపించింది.

వాళ్లు మాధవరావుని ద్వేషించడానికి కారణం ఏమిటి? అతడు చేసిన తప్పేమిటి?

వాళ్ల మాటలనుబట్టి తన తాత మాధవరావు సంగతి కొంత తెలుస్తూ వుంది. పూర్తి వివరాలు తెలుసుకోడానికి మళ్లీ ఆ ఊరు వెళ్లడానికి అతడికి మనస్కరించలేదు.

కొద్దిరోజులపాటు అతడు చనిపోయిన తన తల్లి, అమ్మమ్మ, తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుతెచ్చుకుంటూ గడిపాడు. ఆలోచించేకొద్దీ చాలాకాలం క్రితం చనిపోయిన ఒకానొక తన పూర్వీకుడి జీవితరహస్యం తెలుసుకోవాలనే కుతూహలం అతడిలో పెరుగుతూ వచ్చింది.

జీవా తల్లి చనిపోయి అప్పటికి పదేళ్లయింది. అమ్మమ్మ చనిపోయి ఇరవై ఐదేళ్లయింది. అప్పుడు తన వయసెంత? అతడికే తెలీదు. మాధవరావు చనిపోయేనాటికి జీవా తల్లికి పదేళ్ల వయసు.

అతడికి తన్న చిన్ననాటి జ్ఞాపకాలు ముక్కలు ముక్కలుగా విడిపోయి వున్నాయి. దేని తరవాత ఏది అన్నది ఇదమిద్ధంగా అతనికి తెలీదు. కొన్ని సంఘటనలు గుర్తుతెచ్చుకోడానికి కొన్ని నెలల సమయమే పట్టింది. కొన్నిటిని అతడు పూర్తిగా మరిచిపోయాడు. మరికొన్ని అతడి సమక్షంలో జరిగినవికావు.

జీవాతో అతడి తల్లి అమ్మమ్మ గురించి, తాత గురించి ఎప్పుడన్నా చెప్పేది. ఆమెకీ తన తండ్రి మాధవరావు గురించి పూర్తిగా తెలీదు. ఆమె ఎప్పుడు మాట్లాడినా తరచూ తన తల్లి గురించే చెప్పేది. ఆమె పుట్టి పెరిగింది గుంటూరు.

చిన్నతనంలో అప్పుడప్పుడు తల్లితోపాటు గుంటూరు వెళ్లేవాడు. జిన్నా టవరు దాటి సరాసరి కొత్తపేట సందుకు ఎడమవైపుకు తిరిగితే శీలంవారి ఇరుకు వీధి. వీధికి ఒక వైపంతా నాచుపట్టిన ఎత్తైన ప్రహరీగోడ. మరోవైపు పాతకాలం నాటి ఇళ్ల వరస. వీధి లోపలికి నడుస్తూ పోతే కుడివైపున జీవావాళ్ల అమ్మగారి ల్లుండేది. అది పురాతనమైన రెండంతస్తుల భవంతి. ఎత్తైన గుమ్మానికి బయట రెండువైపులా వీధి అరుగు. లోపల కుడిపక్కన వంటగది. గుండ్రంగా పైకి మెట్లు. పైన చిన్నగది, దానిని దాటితే బయటకు గవాక్షంలా తెరుచుకున్న పిట్టగోడ ఉండేది. పిట్టగోడ మీద నిలబడి చూస్తే కింద ప్రహరీగోడ అవతలనున్న పెంకుటిల్లు, ఎప్పుడూ గోడకు ఆనించి వుండే నులక మంచం కనిపిస్తాయి. పెంకులు ఉన్న కప్పు అంచున చెక్క దూలాలు. పక్కనే చేతికి అందేంత దూరంలో పెచ్చులూడి, రంగు వెలిసిన సిమెంటు అలపైడిబొమ్మ.

ఆ వీధిలో నుంచుంటే ఒక పక్క వర్షపునీటికి నాచుపట్టిన ఎత్తైన ప్రహరీగోడ.. గోడ అవతలినుంచి పైకి లేచి చేతులు చాచిన నల్లటి వేపకొమ్మలు... ఆపై ఆకుపచ్చని వేపాకులు... ఇంకా ఆకాశం.

అక్కడ కొన్ని పరిసరాలు అతడికి ఎంత నిశితంగా జ్ఞాపకం ఉన్నాయో కొన్ని సంఘటనలు అంత లీలగా మాత్రమే గుర్తున్నాయి. అతడికి కొంచెం లీలగా గుర్తున్నది అతడి అమ్మమ్మ శేషారత్నం మరణం.

అ వీధిలో అతని ఈడుదే సరయు అని పిల్ల వుండేది. ఎప్పుడూ భుజాల మీద కుట్లు ఊడిన చిల కాకుపచ్చరంగు జాకెట్టుతో, రెండూ జడలకు ఎర్ర రిబ్బనులు కట్టుకుని ఉండేది. చేతిలో ఎర్రచందనపు బొమ్మతో ఎప్పుడూ అటూఇటూ తిరుగుతూ, ఆ ఇంటి వీధి అరుగుమీద చెక్కగురుగులు పరచి ఆడుకుంటూ ఉండేది.

అమ్మమ్మ చనిపోయిన రోజున సరయుతో కలసి వాళ్లింటికి వెళ్లాడు జీవా. ''ఆ పిల్లవాడిని ఇంట్లోకి రానీకు,'' అని గుమ్మం దగ్గరే ఆపేసింది సరయు వాళ్లమ్మ.

జీవా దూరంగా నుంచుండిపోయాడు. ఇంటికి శవం వచ్చినట్లు అప్పటికతనికి తెలియదు.

సరయూ వాళ్లమ్మ గుమ్మం బైటకు వచ్చి వీధిలోకి తొంగిచూసి మళ్లీ లోపలికి వెళ్తూ, ''వాళ్లమ్మమ్మ చనిపోయింది. మైల. ఆ అబ్బాయిని ముట్టుకోకు,'' అన్నది.

సరయూ ఇంట్లోనే నిలుచుండిపోయి అతడిని వింతగా చూస్తుండిపోయింది.

''శేషారత్నం పోయిందా,'' అన్నారెవరో వీధిలో నడుచుకుంటూ వెళ్తూ.

''అవును. ఆసుపత్రి నుంచి ఇప్పుడే తెచ్చారు,'' అన్నది సరయు వాళ్లమ్మ లోపలి నుంచే.

''పుణ్యాత్మురాలు.''

అక్కడ నిలబడలేక ఇంటికి తిరిగి వచ్చాడు. ఇంటి ముందు గుంపు. ఎవరో పెద్దగా ఏడుస్తున్నారు. అప్పుడే వచ్చిన బంధువెవరో వీధి మొదలు ఎవరి మీదో అరుస్తున్నాడు. జనం కాళ్ల మధ్య నుంచి సందు చేసుకుని ఇంట్లోకి వెళ్లాడు.

లోపల ముందు గదిలో శవాన్ని పడుకోపెట్టారు. తలవైపు గుమ్మం దగ్గర దీపం వెలుగుతూ ఉంది. అమ్మమ్మ తల దగ్గర అమ్మ కూర్చుని ఒకటే ఏడుస్తూ ఉంది. అమ్మమ్మ మొహం వంక చూశాడు. ప్రశాంతంగా కళ్లు మూసుకుని ఉంది. దవడలు లోపలికి పోయి చూడటానికి నవ్వుతున్నట్లుగా ఉంది. పెదాల మధ్య లీలగా కనిపిస్తున్న పై పలువరసలో పగిలిన పన్ను బయటకు కనిపిస్తూ ఉంది. జుట్టు వదులై ఉంది. చూడలేక మళ్లీ వీధిలోకి వచ్చాడు.

ఆ తరువాతేమైంది. అమ్మమ్మని పాడె మీద తీసుకెళ్లిపోయారు. జీవాను వాళ్లతో పోనీలేదు. అమ్మ నేల మీద చెల్లచెదురుగా పడిపోయి బిగ్గరగా ఏడుస్తూ ఉంది. ఆ తరవాత...? అతడికి గుర్తులేదు.

అతడికి తన అమ్మమ్మ జ్ఞాపకాలే సరిగా గుర్తులేవు, అంతకుముందు ఎన్నో సంవత్సరాల క్రితం చనిపోయిన ఆమె భర్త మాధవరావు గురించి ఎలా తెలుస్తుంది...? అమ్మమ్మ చనిపోయాక కొంతకాలానికి అతడి తండ్రి ఆ ఇంటిని ఎవరికో అమ్మేశాడు. పెద్దవుతున్న కొద్దీ ఇల్లుతోపాటు ఆ వీధి కూడా అతడికి జ్ఞాపకాల్లో కనుమరుగయ్యింది. ఎప్పుడన్నా గుంటూరు వెళ్లినా అతడు ఆ వీధికి వెళ్లేవాడు కాదు. ఆ వీధిలో ఇప్పుడు అతడికి తెలిసినవాళ్లెవరూలేరు. ఇప్పుడక్కడ ఆ ఇల్లు కూడా లేదు.

*

అతడి తండ్రి ఉద్యోగరీత్యా అప్పుడు వారు మాచర్లలో ఉండేవాళ్లు. అమ్మమ్మ ఒకతే ఉండటంచేత

అమ్మ నెలకు కనీసం రెండుసార్లన్నా గుంటూరు వెళ్లేది. అమ్మమ్మకు అమ్మ ఒకతే కూతురు, అతడలా ఎన్ని సార్లు రైల్లో మాచర్ల నుంచి గుంటూరు వెళ్లాడో తెలియదు. అప్పుడు ఒకరోజలా గుంటూరు వెళ్లేసరికి పెద్ద గాలివాన మొదలైంది. రెండు రోజులదాకా విడవ లేదు. రెండు రోజులూ ఎక్కడికీ వెళ్లకుండా ఇంట్లోనే చలికి ముణుక్కుని ఉండిపోయారు.

అమ్మ పొట్టు పొయ్యి ముట్టించింది. సన్నటి పొగ పైకిలేచి గుమ్మంలోంచి బయట వానచినుకుల మధ్య పరుచుకుంటూ ఉంది.

పొగలోంచి చూస్తే ఎవరో పిల్ల- గుమ్మంలో నుంచుని వింతగా చూస్తూ ఉంది. చేతిలో చెక్కబొమ్మ. అతడు సరయూని చూడటం అదే మొదటిసారి.

''సరయూ లోపలికి రా,'' అని పిలిచింది అమ్మమ్మ. అమ్మమ్మ అంతే, ఎవరినైనాసరే వాత్సల్యం గా పిలిచేది. ఆమెకు తనా పరా లేదు.

సరయూ లోపలికి రాలేదు. ఆ పిల్ల ఒంటి మీద బట్టలు కొద్దిగా తడిసి వున్నాయి. వర్షపు తుప్పర్లు గుమ్మం నుంచి లోపలికి పడుతున్నాయి.

''జీవా సరయూతో ఆడుకో!''

అతడు కదలలేదు. పొయ్యిలో ఎర్రటి నిప్పుల వంక చూస్తూ కూర్చున్నాడు.

''వాడు రాడు- ఆడపిల్లలంటే వాడికి సిగ్గు,'' అన్నది అమ్మ.

అమ్మమ్మ ఆశ్చర్యంగా చూసి అన్నది- ''మీ నాన్న కూడా అంతే బయట ఆడవాళ్లతో ఎక్కువగా మాట్లాడరు.''

సరయు కాసేపు ఉండి వర్షంలో తడుస్తూనే వెళ్లి పోయింది. ఎందుకు వచ్చిందో ఎందుకు వెళ్లిపోయిందో తెలీదు. బయట వాన తెరిపి పడటంలేదు. వర్షానికి తడుస్తూ వేపచెట్టు బరువుగా వాలి ఉంది.

వానకు ఇంటిపట్టునే ఉండటంచేత అమ్మ ఇల్లు సర్దుతూ పైగదిలో ఉన్న పాత ట్రంకుపెట్టెని కిందకు దింపించింది. రంగుమారిన రుద్రాక్ష మాలలు, విభూతి వుండ, పాతగుడ్డలు బయటపడ్డాయి. పాతకాలం నాటి మాసిన మరచెంబును పక్కన పెట్టి, మకిలి పట్టిన కంచుగ్లాసుని చేతికి ఇచ్చింది. కంచుగ్లాసుని బోర్లిస్తే చెల్లని కానీలు అణాలు బొళబొళమని కింద పడ్డాయి. పాత పుస్తకాల మధ్య డైరీ, రంగు మారిన చిత్తు కాగితాలు. పాత డైరీని తీసి అవతలకు విసిరేశాడు. పాత నాణాలు తప్పితే అతని కిష్టమైనవి ఇంకేమీలేవు అందులో.

ఆ రోజు వాళ్లిద్దరి మాటలను బట్టి మొదటిసారి తన తాత ఒక బైరాగి అని తెలుసుకున్నాడు జీవా.

బైరాగులంటే ఎవరు? అన్నపూర్ణకావిడి అంటే ఏమిటి? తాతయ్య ఇల్లు విడిచి ఎందుకు వెళ్లిపో యాడు? అవన్నీ అర్థంచేసుకునే వయసుకాదు. ఆ రాత్రి అనేక ఆలోచనలతో నిద్ర పట్టలేదు జీవాకు.

ఆ రాత్రి చలికి మునగతీసుకుని పడుకున్నారు. గాలివానకి కిర్రుమని చప్పుడు చేస్తున్న పాతకాలపు కిటికి. దుప్పటి మీదకు లాక్కుని కళ్లు మూసుకున్నాడు. పెనుతుఫానులో నడుస్తూ పోతూ దారి వెతుక్కుంటున్న మనిషి. ఈదురుగాలులలో నల్లటి మబ్బుల మధ్య జడలు విరబోసుకున్న మనిషి హఠాత్తుగా వెనక్కు తిరిగి 'మాతా అన్నపూర్ణేశ్వరీ' అని పిలిచాడు. ఒంటి మీద కాషాయ బట్టలతో నుదుటి మీద విభూతినామాలతో మొహం సరిగా కనపడటం లేదు. నిద్రలో ఉలిక్కి పడ్డాడు జీవా. బయట కూడా ఒకటే వాన.

మెత్తటి చేతులు అతడి చెంపలను తాకాయి. ''ఈశ్వరీ పిల్లవాడు భయపడినట్లున్నాడు దీపం వెలిగించు,'' అంది అమ్మమ్మ.

అమ్మ లేచి నుంచుని చీకట్లో దీపం వెలిగిం చింది.

మీద చేయిపడ్డ చల్లటి స్పర్శ, మెత్తటి చేతులవి. ''ఏం నాయనా భయపడ్డావా,'' ఒణుకుతున్న శేషారత్నం గొంతు. ఎదురింట్లో కొమ్మ విరిగిన శబ్దం.

జీవాకి మెలకువ వచ్చింది. ఇది ఎప్పటిదో చిన్నప్పుడు వచ్చిన కల. ఇప్పటిదీ కలే. ఒకే కల రెండు సార్లు రావడం జరుగుతుందా? అదసలు నిజంగా కలేనా. లేక చాలా సంవత్సరాల క్రితం జరిగిన ఒకానొక సంఘటనా? అదే వర్షం. కాని ఆ ఇల్లు ఇప్పుడు లేదు.

చాలారోజులుగా అతడు అదేపనిగా ఈ విషయం గురించి ఆలోచిస్తుండటం చేత అది కలగా రూపాంతరం చెందిందా? ఆరోజు ఎవరో చీకట్లో దీపం వెలిగించడం అతనికి తెలుసు. అమ్మమ్మ అతడితో మాట్లాడటం తెలుసు. బయట వర్షం నిజమే. కాని ఆ వ్యక్తి... ఆ సాధువు...చిన్నతనంలో ఆ కల వచ్చి ఉండక పోవచ్చు. ఇన్ని రోజుల తరువాత... ఆ సాధువు. జీవాకి

తన తాత గురించి ఆలోచిస్తుండటంచేత కలగా కలగలిపి వచ్చి ఉండవచ్చు.

ఇందులో దేని తరువాత ఏది జరిగింది. ఏది కల- ఏదీ జ్ఞాపకం- ఏది? ఏది నిజం?

*

''చూడు మామ్మా ఆడుకోడానికి జీవా రానంటున్నాడు. ఎంత చెప్పినా వినడం లేదు,'' అన్నది సరయూ కళ్లు పెద్దవి చేసి.

''వాడికి అమ్మాయిలంటే సిగ్గులేవే,'' అన్నది అమ్మమ్మ.

నిజవే. అతడికెందుకో చిన్నతనం నుంచీ అమ్మాయిలంటే ఒకరకమైన సిగ్గు.

''ఇంకా సిగ్గెందుకు పోయినసారి చూశావు కదా,'' అంది అమ్మ.

సరయు కాసేపు ఉండి వాళ్లమ్మ పిలవడంతో వెళ్లిపోయింది.

సరయూ ఎందుకు వస్తుందో ఎప్పుడు వెళ్తుందో తెలీదు. వెళ్లిపోవడమే మంచిది. తనొక్కడే ఆడుకోవచ్చు, అనుకున్నాడతడు.

ఒక్కడే ఎంతసేపు తిరిగాడో తెలీదు. పైకీ కిందకీ తిరుగుతూ మేడపైకి వెళ్లి కొంచెంసేపు పిట్టగోడ దగ్గర నుంచుని మళ్లీ లోపలికి గదిలోకి వచ్చాడు. మిట్ట మధ్యాన్నపు ఎండ పిట్టగోడ నుంచి గదిలోపలికి ఏటవాలుగా పడుతూ ఉంది. గోడకు కొట్టిన అలమార చెక్క తలుపులు మూసి ఉన్నాయి. శేషారత్నానికి అదే దేవుడి గది. చిన్నగా చెక్కతలుపులు తెరిచి చూసాడు. మొదటి అరలో పాతగుడ్డలు కనిపించాయి. రెండవ అరలో సందుగ పెట్టె. మూడవ అర మూడడుగుల ఎత్తు వుంది. అతడికి అందేలాలేదు. కాలి బొటనివేలు చెక్క తలుపు మీద పెట్టి పైకిలేచి చూశాడు. అక్కడేముందో అతడి కళ్లకు కనపడటంలేదు. అతికష్టం మీద తల పైకెత్తి చూశాడు. కుంకుమ, సాంబ్రాణి వాసన. నల్లటి సాంబ్రాణి పొగతో కమురుకట్టిన గూడు. మురళిని చేతిలో పట్టుకుని కనకాంబరమాల ధరించిన కృష్ణుడి మట్టిబొమ్మ. వెనుకనే మైమరచి వేణుగానం వింటున్న గోవు. అటూ ఇటూ ఎవరివో ఫొటోలు. పక్కనే తాతయ్య ఫొటో కావచ్చు. అతడు మునివేళ్ల మీద నుంచుని పైకి చూడబోతే వెనక నుంచి ఎవరో అతడి భుజం మీద చేయివేసారు.

ఉలిక్కిపడి వెనక్కు చూశాడు.

అమ్మమ్మ అచ్చం కృష్ణుడిలా నవ్వింది. విరబోసుకున్న ఉంగరాల జుట్టు భుజం మీద వేలాడుతూ ఉంది. నవ్వుతున్నప్పుడు పై పలువరసలో పగిలిన పన్ను కనిపించింది.

''మాధవుడు నాయనా,'' అన్నది అమ్మమ్మ దేవుడి గూట్లోకి చూస్తూ.

ఆరోజు అమ్మమ్మ చెప్పింది ఏ మాధవుడి గురించి? తన వేణుగానంతో గోవుని మైమరపిస్తున్న లీలా మానుషుడైన మాధవుడి గురించా? లేక తనను తుఫానులో ఒంటరిగా విడిచిపెట్టి వెళ్లిపోయిన తన భర్త మాధవరావు గురించా? అక్కడ వున్నది ఏ మాధవుడు?

ఆ తరవాత అమ్మమ్మ చనిపోయాక చాలారోజులకు మళ్లీ అక్కడకి వెళ్లాడు. ఆరోజు అమ్మ ఎవరింటికో వెళ్లింది.

ముందుగదిలోంచి మెట్లు ఎక్కి మేడపైకి వెళ్లి పిట్టగోడను ఆనుకుని నుంచున్నాడు. పురాతనమైన వస్తువులేమైనా దొరుకుతాయేమోనని కాసేపు వెతికాడు. నేల మీద ఒక మూలన మంచినీళ్ల కుండ ఉంది. గోడకు పటాలేవీలేవు. గోడకు ఉన్న అలమారకు చెక్క తలుపులు వేసి ఉన్నాయి. నిదానంగా తెరిచి ఒక కాలు తలుపు మీదపెట్టి అలమారలోకి చూశాడు. అక్కడ.... తదేక ధ్యానంతో వేణుగానం చేస్తున్న మురళీకృష్ణుడు. అదే నిశ్చలమైన రూపం. మట్టిబొమ్మ అని ఒదిలేసి నట్టున్నారు. వేరే దేవుడి పటాలేవీ అక్కడలేవు.

''ఎందుకది?'' అన్నాడు నాన్న వెనకనుంచి వచ్చి.

''మట్టిబొమ్మ పగిలిపోతుంది,'' అన్నది అమ్మ. బయట నుంచి ఎప్పుడు వచ్చిందో.

''పూజచేస్తావా? అక్కడే వదిలెయ్.''

అతడు వదిలేయలేదు. బరువైన ఆ మట్టిబొమ్మని పదిలంగా చేతిలోకి తీసుకున్నాడు. నిజంగా అది తనకెందుకో అతడికే తెలీదు.

పూజించడానికా? బహుశా ఆడుకోడానికేమో. అతడికి ఆటబొమ్మలు ఎక్కువ ఉండేవి కావు.

ఆ ఇంటికి రావడం అదే ఆఖరుసారి.

గుంటూరు నుంచి మాచర్లకు తిరుగు ప్రయాణమయ్యారు. మట్టిబొమ్మని అమ్మ సంచిలో పెడతానన్నా ఇవ్వలేదు. రైలులో ఉండగానే గాలివాన మొదలైంది. ఒకటే ఈదురుగాలి. చేతిలో మట్టిబొమ్మ జాగ్రత్తగా

పట్టుకుని కిటికీ పక్కన కూర్చున్నాడు. నానిపోకుండా ఎలాగైనా ఇంటికి తీసుకెళ్లాలి. కిటికీ పక్కన కూర్చుని శూన్యంలోకి చూస్తున్నాడు నాన్న. అమ్మ విచారంగా కూర్చుని ఉంది. బయట ఒకటే ఈదురుగాలి. వాన రైలుతోపాటు పరిగెడుతూ ఉంది.

రైలు మాచర్ల చేరేసరికి వర్షం ఆగిపోయింది. రైలుదిగి ఇంటికేసి పరిగెడుతూ ఉన్నాడు. వెనకనుంచి అమ్మ, నాన్న పిలుస్తూ ఉన్నారు.

"నేను మొదటినుంచీ చెప్తూనే ఉన్నాను. వింటే కదా," అని విసుక్కున్నది అమ్మ.

పరిగెడుతూ ఇంటికి వచ్చి గేటుతీశాడో లేదో... చేతిలోంచి మట్టిబొమ్మ జారిపడి... పగిలిపోయింది. వర్షం వెలిసిన పసుపురంగు ఆకాశం. ఒకదానినొకటి మింగుతున్న నల్లటి మబ్బులు వలయాలు వలయాలుగా చుట్టుకుంటూ... మళ్లీ సన్నటి వానచినుకులు.

చెట్టుకిందకి వెళ్లి ముడుచుకుని కూర్చున్నాడు. అతడి పక్కనే వాననీటిని బొట్లుబొట్లుగా ఆకుల నుంచి రాలుస్తున్న చెట్టు. నేలనుంచి నింగివరకూ కనిపించే దంతా సన్నటి వానతెరలా ఉంది.

అతడికి కొన్ని జ్ఞాపకాలున్నాయి. వాటిలో మాధవరావు లేడు. 'ఈ జ్ఞాపకాల్లోంచి మాధవరావుని అందుకోగలడా? తనకంటే రెండు తరాల ముందు మనిషి, తనెప్పుడూ చూడని మనిషి గురించి తనకెలా తెలుస్తుంది?' అనుకున్నాడతను.

అయినా అతడు మాధవరావు గురించి ఆలోచించడం మాత్రం మానలేదు.

*

జీవా తనకు తెలిసిన బంధువుల దగ్గర మాధవరావు గురించి వాకబు చేశాడు. సేకరించిన వివరాలను బట్టి మాధవరావుని చిన్నతనంలోనే పెదనాన్న వరసయ్యే రామబ్రహ్మం అనే వ్యక్తి పిల్లలు లేకపోవడంతో దత్తత తీసుకున్నాడు. మాధవరావు తల్లిదండ్రులది అత్యంత సామాన్యమైన వ్యవసాయ కుటుంబం. ఆయన దత్తత వెళ్లేనాటికి ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. ఆయనకీ వాళ్లకీ వయసులో చాలాతేడా ఉంది. ఆయన కంటే వాళ్లు చాలా చిన్నవాళ్లు. వాళ్లు వ్యవసాయంలో స్థిరపడి కాలగర్భంలో కలిసిపోయారు. బంధువుల ద్వారా అంతకుమించి ఇంకే వివరాలూ దొరకలేదు.

బంధువులు కాక మాధవరావు గురించి తెలిసిన వ్యక్తి ఒకరిద్దరున్నారు. అమ్మ తరచుగా ఒక వ్యక్తి గురించి చెప్తూ ఉండేది. ఆయన పేరు వెంకట నారాయణ. అది చాలాకాలం క్రితం సంగతి. బహుశా ఇప్పుడు- ఇన్నిరోజుల తరువాత ఆయన బతికి వుంటాడా?

ఒకసారి పని మీద గుంటూరు పోవలసివచ్చింది. పని పూర్తి చేసుకుని వెంకట నారాయణని వెతుక్కుంటూ అరండల్‌పేట వెళ్లాడు జీవా.

సగం తెరిచిన తలుపు పక్కనే నీళ్లతొట్టి. లోపలికి తెరచుకున్న గదులు గదులుగా పొడవాటి ఇల్లు. వరండాలో నేల మీదే నడుము వాల్చిన ముసలావిడ. పాతకాలపు చెక్కకుర్చీ. టేబుల్ మీద పాత పుస్తకాలు. పైన గోడ మీద చెక్కతో చేసిన అలమారలో రకరకాల హోమియో మందులు.

'ఎవరో వచ్చారని' ముసలావిడ పిలవగానే వెంకటనారాయణగారు లోపల నుంచి నిదానంగా బయటకువచ్చి, జీవాని చూసి కుర్చీలో కూర్చున్నాడు.

వెంకటనారాయణగారు ఎనభై సంవత్సరాల మనిషి. హోమియోపతి వైద్యుడు. నల్లటి కళ్లద్దాలలోంచి కాసేపు కళ్లలోకి చూస్తూ నొసలు ఆడిస్తూ బయటకు చూస్తూ విచిత్రమైన ప్రవర్తన.

"మాధవరావు నాకు తెలిసిన మనిషే. నాకంటే చాలా పెద్దవాడు. మేమప్పుడు వాళ్ల వీధిలోనే ఉండేవాళ్లం. నేనప్పుడు హిందూ కాలేజిలో చదువుతుండే వాణ్ణి. రైల్వేలో ఉద్యోగం చేస్తూ హోమియో వైద్యం నేర్చుకున్నాను. ఎప్పుడన్నా సందేహాలుంటే ఆయన దగ్గరకు వెళ్లేవాడిని. ఎలా ఉండేవాడు...? ఎలా అయిపోయాడు? హోమియోపతి బాగా తెలిసిన వ్యక్తి. ఏమయిందో తెలియదు. ఉన్నట్లుండి ఎవరికీ కనిపించకుండా పోయాడు. చాలాచోట్ల వెతికించారు. బెజవాడ కనకదుర్గ గుడి కొండ కింద సత్రంలో సన్యాసివేషంలో చూశామని, తమని చూడగానే వడివడిగా తప్పించుకుపోయాడనీ ఎవరో చెప్పారు."

"చాలాకాలం తరవాత గుర్తుపట్టని అవతారంతో తిరిగి వచ్చాడు. అది కూడా ఇంటికి రాలేదు. అన్నపూర్ణ కావిడేసుకుని ఇల్లిల్లూ తిరుగుతున్నాడని చెప్పారు. ఊరి బయట బైరాగుల మఠంలో ఉంటున్నాడని ఇంకెవరో చెప్పారు. పాపం మీ అమ్మమ్మ శేషారత్నంగారు... మీ అమ్మను తీసుకుని వెళ్లి ఇంటికి రమ్మని బతిమిలాడింది. ఆమె బాధ చూడలేక ఇంటికి వచ్చాడు. కాని

వచ్చినట్లే వచ్చి మళ్లీ ఇట్టే మాయమయ్యాడు. ఇంట్లో చేతికందిన వస్తువులన్నీ తీసుకెళ్లాడు. అలా చాలాసార్లు జరిగింది.''

''స్థిమితంలేని మనిషి. అలా ఎందుకు చేసాడో తెలియదు. బతకలేక కాదు. ఏదో వెతుకులాట అనుకుంటాను. కొందరంతే.''

''అప్పుడు మీరాయన్ని చూసారా?''

''చూసాను- జడలుపట్టిన జుట్టు. పీక్కుపోయిన దవడలు. ఎప్పుడూ కలవరిస్తుండేవాడు. ఎవరు విన్నా వినకున్నా తనలో తను మాట్లాడుకునేవాడు. తరచుగా ఏదో అనేవాడు. ఏమిటది... అవును, ఏక్షణంలో ఏం జరుగుతుందో ఏమో... జాగ్రత్తగా ఉండాలనేవాడు. ఎందుకొచ్చిందో ఆ మార్పు. చాలా అకస్మాత్తుగా వచ్చింది. చివరి రోజులలో చాలా బాధపడ్డాడు. పశ్చాత్తాపం చేత కావచ్చు. చిన్న వయసులోనే మరణం. అయితే నువ్వు కూతురు కొడుకువా. మీ అమ్మ పేరేమిటి. ఈశ్వరి కదూ!''

సెలవు తీసుకుని బయటకు వచ్చేసాడు. జీవా.

వెంకటనారాయణగారు చెప్పిన వివరాలు అతడికి సంతృప్తి కలిగించలేదు. ఎవరికి తెలిసినట్లు వాళ్లు మాట్లాడుతున్నారు. ఎవరికీ ఏమీ సంపూర్ణంగా తెలియదు. ఆయనలో వచ్చిన ఆ ఆకస్మిక మార్పుకు కారణం ఎవరికీ తెలీదు. అది ఆయన శరీరంతోపాటే పంచభూతాల్లో కలిసిపోయింది.

జీవానందానికి ఆ ఇల్లు చూడాలనిపించింది. రిక్షా మాట్లాడుకుని అరండల్ పేట నుంచి కొత్తపేటకి వచ్చాడు. ఆ వీధిలోకి అడుగుపెట్టబోతుంటే కాళ్లు వణికాయి. ఇంకా అదే పాతకాలం నాటి ప్రహరీగోడ. వేపచెట్టు. తమ ఇంటికి అటూ ఇటూ ఇంకా అవే పాత ఇళ్లు. పెచ్చులూడిపోతున్న గోడలు. అక్కడిప్పుడు వాళ్ల అమ్మమ్మ ఇల్లులేదు. దానికి బదులు పైకిలేచిన మూడంతస్థుల మేడ.

''ఎప్పుడు రావడం?'' అన్న పలకరింపుతో ఉలిక్కిపడి వెనక్కు చూశాడు జీవా.

పెళ్లికి వెళ్లినప్పుడు ఆ ఊళ్లో, 'గుంటూరు ఎప్పుడు వస్తున్నావ్?' అని పలకరించిన ముసలివ్యక్తి అపరిచితుడు. పూర్తిగా నెరిసిన తల. పైజమా, పంచెకట్టు. చేతిలో గొడుగు. అతడితో తమ బంధుత్వమేమిటో జీవాకి తెలియదు.

''పని మీద వచ్చాను. ఒకసారి చూసివెళ్దామని,'' అంటూ అతడిని అనుసరించాడు జీవా. మాధవరావు గురించిన సమాచారం ఇంకొంచెం దొరకొచ్చుననిపించింది.

ముసలి వ్యక్తి తన దగ్గర ఉన్న తాళం చెవులతో ఒక ఇంటి తలుపు తెరిచాడు. కిర్రుమని తలుపులు తెరుచుకున్నాయి. ముఖానికి గుప్పుమని కొట్టిన పాత కాలపు వాసన. మంత్రించినట్లు చిన్ననాటి రోజులు తలపుకొచ్చాయి. మాధవరావు గురించి కదిపాడు.

''మాధవరావు ఆ రోజుల్లో పేరు మోసిన టైలరు కూడా. ఇంగ్లీషువారైన జడ్జీలకి, కలెక్టర్లకి కోటులు కుట్టేవాడు. ఒక ఆంగ్లేయ కలెక్టర్ ఈయనంటే చాలా ఇష్టపడేవాడు. అలాగని ఇంగ్లీషువారిని సమర్థించిన వ్యక్తి కాదు. 1946లో అనుకుంటాను మహాత్ముడిని చూడటానికి ఆయనతో పాటు గుంటూరు నుంచి తెనాలి రైల్వేస్టేషను వెళ్లాను. నాకంటే పెద్దవాడు. దర్జా మనిషి. రంగూన్ వెళ్లాడు. ఆ రోజుల్లో అది చాలా గొప్ప విషయమే.''

''ఆయన ఎలా ఉండేవాడు?''

''చాలా బాగా గుర్తు. పొడవాటి జుట్టును వెనక్కు దువ్వుకునేవాడు. ఎప్పుడూ ఒంటి మీద ఓవర్ కోట్ వేసుకునేవాడు. ఉత్సాహమైన మనిషి- చాలా చలాకీగా ఉండేవాడు. ఆయన ఒక పద్ధతిలో నడుచుకున్నట్లు కనిపించదు. ఎవరి మాటా వినేవాడు కాదు. తనకు నచ్చినట్టు, తను ఎలా ఉండాలనుకుంటున్నాడో అలానే ఉండేవాడు. అందరికీ అరాచకుడిలా అనిపించేవాడు. ఎవరినీ లక్ష్యపెట్టేవాడు కాదు.''

''ఆయన ఇల్లు విడిచి వెళ్లిపోయాడని చెప్పారు. ఎందుకో తెలుసా?''

''ఆ విషయం నాకు తెలియదు. చాలా సంవత్సరాలపాటు నేనిక్కడలేను. ఉద్యోగరీత్యా కలకత్తా వెళ్లవలసి వచ్చింది. చివరిరోజుల్లో మాత్రం ఒకసారి ఇక్కడే - ఇంటి దగ్గర చూశాను. చాలా మారిపోయాడు. ఎందుకో తెలీదు. చాలా ఉన్నట్లుండి వచ్చిందా మార్పు. ఊరికూరికే ఉలిక్కిపడేవాడు. ఎప్పుడూ 'ఏ క్షణంలో ఏం జరుగుతుందో. జాగ్రత్తగా ఉండండి,' అనేవాడు. మతి చెడిందేమోనని చాలాచోట్ల చూపెట్టారు.

''మీ పిచ్చిగాని కనపడేదానికి కనిపించనిదానికి మధ్య సన్నటితెర తొలగిపోయాక ఇక అంతా పిచ్చిగానే కనిపిస్తుంది, అనేవాడు.''

"ఆయన ఏదో చెప్పాలనుకుని చెప్పలేక తనకు తెలిసింది మనుషులకు అర్థం చేయించలేక పెనుగు లాడి చివరకు చనిపోయాడు."

ఆయన చూసింది ఏమిటి? ఎప్పుడు వచ్చిందా మార్పు? రంగూన్‌లో వుండగా వచ్చిందా? టైలరు వృత్తిలో ఉన్నప్పుడు వచ్చిందా? ఎవరికీ తెలీదు. మాధవ రావు జీవితం విచిత్రంగా అనిపించింది జీవాకి. ఒక మనిషికి అనేక రూపాలు. ఒకరికి తెలిసింది మరొకరికి తెలీదు. తనెప్పుడూ చూడని మనిషి గురించి తనకేమి తెలుస్తుంది? తన తాత మాధవరావు గురించి తెలియా లంటే తను ఆ కాలంలో పుట్టి ఉండాల్సింది. ఒకవేళ ఆరోజుల్లో తను ఉండి అంటే... మాధవరావుని చూసి ఉంటే... అతడిని అర్థం చేసుకోగలడా...? జీవాలో అనేక ఆలోచనలు.

*

మాధవరావు గురించిన సమాచారం అతడికి ఇంకా అస్పష్టంగానే ఉంది. బంధువుల నుంచి, తెలిసిన వారి నుంచి, చిన్ననాటి జ్ఞాపకాల నుంచి ఒక నిర్ధా రణకు రాలేకపోయాడు. ఆయన మనసులానే ఆయన జీవితం కూడా చంచలమైంది. ఆయన గురించి ఇంకా ఏదో తెలుసుకోవాలనే ఆసక్తి జీవాకి రోజురోజుకీ పెరుగుతూ వస్తున్నది. తెలిసే కొద్దీ మాధవరావు జీవితం అర్థం కాకుండా ఇంకా గందరగోళం ఉంది.

జీవితంలో తనెప్పుడూ చూడని వ్యక్తిని గురించి ఇంతగా ఆలోచిస్తాడని జీవా ఎప్పుడూ అనుకోలేదు.

ఒక ఆదివారం కూర్చుని పాత సామానులన్నీ తిరగేశాడు. ఇత్తడి బిందెలు, పాతపుస్తకాల కట్ట. లింగా ష్టకం, హనుమాన్ చాలీసా, వాటితోపాటు కనిపించింది ఆ పాతడైరీ. చివరికి అమ్మ పెట్టెలో కనిపించింది ఒక మూలన. అమ్మ తనకోసం దాచుకున్న డైరీ. కంచు గ్లాసులో పాత రాగినాణాలు తీసుకుని పక్కకు విసిరేసిన డైరీ. అపురూపమైన వస్తువులాగ, ఆతృతగా చేతిలోకి తీసుకుని చూశాడు. రంగు వెలిసిన ప్లాస్టిక్ కవరు. అతను వెతుకుతున్న తన పూర్వీకుడి జీవితరహస్యం అందులో దొరుకుతుందా?

ఒణుకుతున్న చేతులతో ఆతృతగా తీశాడు.

పైన అట్ట తిప్పితే అంకెం మాధవరావు అన్న పేరు కనిపించింది. ఒక పేజీలో ధూర్జటి పద్యం. వేళ్ల తగిలితే రాలిపోతున్న పాత కాగితం. రంగు వెలిసిన ఇంకు పెన్నుతో రాసిన గొలుసుకట్టు రాత. మధ్యలో చాలారోజుల పాటు ఏమిరాయాలో తోచక ఒదిలేసిన-రాయని ఖాళీ కాగితాలు. తరువాత ఇంకెవరో రాసిన రామకోటి. మరోచోట హోమియోపతి గురించి గొలుసు కట్టు రాత మాధవరావుదే. సందేహంలేదు. మొత్తంగా పేజీలు తిప్పుతుంటే ఇంకుపెన్నుతో రాసిన అక్షరాలు కనిపించాయి. జీవా ఒక్కొక్క అక్షరం కూడపలుక్కుని కష్టపడి చదివాడు.

'ఒకదాని తరువాత ఒకటి జరిగే అనేకానేక సంఘ టనలు, అసంఖ్యాక చర్యలు ఇవన్నీ ఏదైనా జీవిత సూత్రంలో ఇముడుతాయేమోనని చూశాను. ఊహు... లాభంలేదు. కళ్లు చించుకుని చూసేకొద్దీ చీకటి ఇంకా ఎక్కువవుతా ఉంది. ప్రశ్నలతో పెనుగులాడేకొద్దీ చిక్కు ముడి బిగుసుకుంటూ ఉంది. ఎంత వెతికినా దీనికొక రూపం కనిపించలేదు. ఏదీ దేనిలో ఇమిడే అవకాశం లేదు. ఇదొక వృథాప్రయాస. ఇలా ఆలోచించడం ప్రారంభిస్తే... ఇది... ఇదొక తుఫాన్... ఇది... అన్నిటినీ తనలో కలిపేసుకుంటుంది. అన్నిటినీ ఊడ్చిపారే స్తుంది. ఈ తుఫాను నన్ను ఉక్కిరిబిక్కిరి చేసి నన్నెక్క డికో దిగంతానికి విసిరేసింది.

'ఇది క్షణక్షణానికీ ఆకారం మారే మేఘం మాదిరి అనుక్షణం ఇది తన రూపం మార్చుకుంటూ ఉంది. ఈ సుడిగాలికి ఒక దశ, దిశలేదు.'

ఆ తరువాతి వెలిసిపోయిన ఇంకు అక్షరాలు జీవానందానికి కనిపించలేదు. కొన్ని అక్షరాల తరవాత ఇక ఇంగ్లీషు పదం- మొదట 'c' అక్షరం. హెచ్... తరవాత రంగులేని ఖాళీ. చివర 's.' ఏమిది? chao...s

Chaos...

'ఖేయోస్...!' - అంటే ఏమిటి... గజిబిజి, గందర గోళం... సంతృప్తి కలగలేదు. డిక్షనరీ తీసి చూశాడు జీవా... క్రమము తప్పియుండుట... చిందరవందర... డిస్ ఆర్డర్... కంఫ్యూజన్

ఇంకొంచెం లావుపాటి డిక్షనరి తీసుకుని చూశాడు. ఖేయోస్ అంటే 'సృష్టికి పూర్వమున్న పదార్థపు అవ్యక్తస్థితి' అని ఉంది. అది అతడి ఊహకు అంద లేదు.

రాసిన వాటికి ఎక్కడా తారీఖు లేదు. నెల, సంవ త్సరం మాత్రం ఉంది. అప్పటికి జీవా పుట్టలేదు. అమ్మకు పెళ్లి కాలేదు. అమ్మ వయసు పదేళ్లుండవచ్చు. తాతయ్య చనిపోయేముందు తిరుగుబోతు జీవితానికి

స్వస్తి పలికి ఇంటి పట్టునే ఉన్నాడు. బహుశా ఆయన తన చివరిరోజులలో రాసింది కావచ్చు.

అంతకుమించి దాంట్లో ఏమీలేదు. జీవాకి కొంత అర్థమయి కొంత అర్థం కానట్లుగా ఉంది. ఎవరు తీర్చ గలరు అతడి సందేహాన్ని? ఆ పాతకాలపు డైరీని చదివిన తరువాత జీవా మరింత గందరగోళంలో పడి పోయాడు. మాధవరావు ఏ నిర్ణయమూ తీసుకోలేని దుర్బలుడు. ఎవరినీ లక్ష్యపెట్టని అరాచకుడు, బికారి, తిరుగుబోతు, అయోమయం మనిషి. ఒకరికి తెలిసిన మనిషి మరొకరికి తెలియదు. ఒకరికి ప్రతిభావంతమైన హోమియో వైద్యుడు. మరొకరికి దత్తత వెళ్లిన జల్సా రాయుడు. మరికొందరికి అన్నపూర్ణ కావిడి భుజాన వేసుకుని ఇల్లిల్లు తిరిగి 'మాతా అన్నపూర్ణేశ్వరీ భిక్షాం దేహి' అంటూ అడుక్కుతినే బైరాగి. తనకు- తన లోపలి ఇనుప ట్రంకుపెట్టెలో శాశ్వతంగా కళ్లుమూసుకున్న కవి.

*

ఇప్పటివరకు తన జ్ఞాపకాలని తరచి చూసు కుంటే తన అమ్మమ్మ శేషారత్నం ఒక క్రమబద్ధమైన జీవితాన్ని గడిపినట్లుగా అర్థమవుతూ ఉంది జీవాకి. అతడికి గుర్తున్నంతవరకు ఆమె ఈ లోకంతో పనిలే నట్లుగా ఉండేది. ఆవిడ చేసిన పూజలు,వ్రతాలు తప్పితే ఆమె గురించి ఎవరికీ ఏమీ తెలియదు. కోపం తెలియని మనిషి. శాంతస్వభావి. మా అమ్మ తొణకని మనిషి అనేది అతడి తల్లి.

ఒకరిది క్రమబద్ధమైన జీవితం. మరొకరిది అల్ల కల్లోలం.

ఒకరిది నియమనిష్టం. మరొకరిది నియతి రాహిత్యం.

ఒకరిది పరిమితమైన జీవితం. మరొకరిది అపరి మితమైన అనుభవం.

వాళ్లిద్దరిని పోల్చి చూసుకున్నాక మాధవరావు గురించి కొంతవరకు అర్థమవుతూ ఉంది.

అంతవరకు తెలిశాక అతడు ఆయన గురించి ఆలోచించడం పూర్తిగా మానేశాడు. మరచిపోయినంత కాలం మనసు తేలికగా అనిపించింది.

చాలారోజుల పాటు అతడికి ఇంకెటువంటి కలలూ రాలేదు. ఏ జ్ఞాపకాలూ అతడిని వెనక్కి తీసుకెళ్ల లేదు. విచిత్రమేమంటే దేనినైనా అతడు పూర్తిగా మరచి పోయినప్పుడే కళ్ల ముందు మెరిసి మాయమైనట్లు చటుక్కుమని అవి గుర్తుకువస్తాయి.

మాధవరావు గురించి ఆలోచించడం మానేశాక గతంలో జరిగిన ఒక సంఘటన తళుక్కున మెరిసింది. అతడికి గుర్తున్నంతవరకు అదే ఆఖరి జ్ఞాపకం.

ఎప్పుడు జరిగిందా సంఘటన?

రెండు సంఘటనల మధ్య.

అదే స్థలం. అదే ఇల్లు.

మొదటిసారి అమ్మమ్మ ఉండగా. చివరిసారి అమ్మ సమక్షంలో.

జీవా ఆ బొమ్మను అక్కడనుంచి తీసుకువచ్చే టప్పుడు. మధ్యలో అతడు ఒక్కడే అక్కడికి వెళ్లి నప్పుడు-

అమ్మమ్మ చనిపోయాక ఆ ఇల్లు పాత సామాను తో చాలారోజులపాటు పాడుబడి ఉంది. నాన్న ఆ ఇంటిని ఎవరికో అమ్మేసిన తరువాత అమ్మతో పాటు సామాను ఖాళీ చేయడానికి చాలాసార్లు అక్కడికి వెళ్లాడు.

అలా ఒకసారి- ఆరోజు ముందు కింద హాలు లోంచి మెట్లెక్కి పైకి వెళ్లి పిట్టగోడ దగ్గర నుంచు కున్నాడు. ఎదురింటి ప్రహరీగోడపై నుంచి సూర్యుడు అప్పుడప్పుడే పైకి లేస్తుండగా ఇంటి ముందు నీడ వెనక్కి జరుగుతూ ఉంది. తలమీద గంప పెట్టుకుని అమ్ముకునే ఆడమనిషి అరుపు వీధి చివర వినిపిస్తూ ఉంది. వాహనాల రొదలో సైకిలు బెల్లు. సందుచివర వచ్చిపోయే వాహనాల రణగొణధ్వని.

కింద ఎవరో అమ్మతో మాట్లాడుతూ సరయూ వాళ్లు కిందటి నెలే ఇల్లు ఖాళీచేసి వెళ్లిపోయారని చెప్తున్నారు. వెనక్కి వచ్చి స్టూలు వేసుకుని దేవుడి అర లోకి చూశాడు. ఎండిపోయిన చేమంతిమాల కృష్ణుడి మెడలో వేలాడుతూ ఉంది. అరనిండా కాలిపోయిన సాంబ్రాణి కడ్డీల కాడలు. ఎండిపోయిన పూలు. పసుపు, కుంకుమ. ఒత్తులైపోయిన ఇత్తడి దీపపు కుందులు. కృష్ణుడి బొమ్మ కాస్త రంగువెలిసి ఉంది. కృష్ణుడిని ఆనుకుని నుంచున్న ఆవుకి ఒక కొమ్ము విరిగి ఉంది. లోపలికి చేయి చాపి కృష్ణుడిని పక్కకు కదిపాడు. మట్టి బొమ్మ బరువుగా కదిలింది. దారపు దండ ఫొటోఫ్రేము. అద్దం వెనక ఫొటోలో ఉన్న వ్యక్తి ఖరీదైన కోటు ధరించి వున్నాడు. మొహం గుర్తుపట్టకుండా చెదలు తినేసి వుంది.

ఈ జ్ఞాపకంతో అతడి పూర్వీకుడి జీవితరహస్యం పూర్తిగా మూసుకుపోయిందా? ఇంతకు మించిన సంఘ

టనలు ఇంకేమన్నా ఉంటే అవి అతని సమక్షంలో జరిగినవి కావు. మాధవరావు గురించి తెలుసుకోడానికి ఇంకే జ్ఞాపకాలూ లేవు. వివరాలు చెప్పేందుకు ఇంకెవరూ లేరు. ఆ ఫొటోలోని వ్యక్తి- మాధవరావు తన ముఖాన్ని చూపకపోయినా కనీసం తన గురించిన ఇంకొన్ని వివరాలు ఈ భూమ్మీద మిగిల్చి వెళ్లుంటే జీవాకి అంత నిరాశ కలిగేది కాదు.

ఆ సాయంత్రం తను విన్నవీ, చూసినవి, తన కలలూ దిగులూ- తర్కించుకుంటూ సమీకరించుకుంటూ జీవా ఎప్పుడు నిద్రపోయాడో తెలియదు.

పొలాల మధ్య గీపెట్టి వెళుతున్న రైలు... వర్షం వచ్చే ముందు చల్లబడిన వాతావరణం. పసుపురంగు ఎండ. చిలకాకుపచ్చరంగు జాకెట్టు వేసుకున్న ఒక పాప అరుగు మీద నిద్రిస్తూ ఉంది. ప్రక్కనే ఖాళీ గురుగులు పరిచి ఉన్నాయి. ఎవరివో చిన్న అడుగులు... నేల వేగంగా కదులుతూ మొదట చిన్నగా మొదలై క్రమేణ వేగంగా పడుతూ... ఇంతింతగా పెద్దవవుతూ గాలిలో తేలిపోతూ ఉన్నట్లుండి ఆ చివరి నుంచి ఈ చివరకు చీలి మెరిసింది ఆకాశం. మబ్బులు ఒకదానితో ఒకటి తల పడుతున్నట్లుగా ఉరుములు. ఉన్నట్లుండి ఎక్కడ నుంచి వచ్చాయో నల్లటి మబ్బులు ఒకదాని మీద ఒకటి కమ్ముకుంటూ వలయాకారంగా తిరుగుతూ ఆకాశాన్ని ఆక్రమించాయి. గట్టిగా పట్టుకునున్న మట్టి బొమ్మ ఉన్నట్లుండి చేతిలోంచి జారిపడి నల్లటి మబ్బులు బొమ్మ విరిగినట్లుగా ఒక దాన్నుంచి ఒకటి చీలిన రేఖలు రూపందాల్చి- ముడతలు పడ్డ మొహం, చిన్నగా నవ్వుతూ ఉంది- ఆమె... అమ్మమ్మ. శేషారత్నం! ఒక్కసారి నవ్వు మెరిసి మరుక్షణం మబ్బులు విడిపోయి, మాయమైంది.

ఉలిక్కిపడి నిద్రలేచాడు జీవా. మసకచీకటిలో గోడమీద ఫాను నీడ గిరగిరా తిరుగుతూ ఉంది. కళ్లను నులుముకుని చేతివేళ్ల వంక చూసుకున్నాడు. అతనికి ఏదో చేతికి అందినట్టే అంది, అర్థమవుతున్నదేదో హఠాత్తుగా అదృశ్యమై, చెల్లాచెదురై చివరికి ఖాళీగా అనిపించింది.

*పాలపిట్ట మాసపత్రిక, మార్చి 2011*

